PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 220 | సంపుటి 4 | మంగళవారం | 28-04-2026 | పేజీలు 4 | వెల 3/- | ఎడిటర్ పి. రవిచంద్ర



- మహిళల రక్షణ కోసం ప్రత్యేక వాహనాలు
- మత్తు పదార్థాల నియంత్రణకు 'ఈగల్ ఫోర్స్' ఏర్పాటు..
- బాధ్యులెవరైనా ఉపేక్షించేది లేదు..
- స్వయం సహాయక సంఘాలకు రూ. 60 వేల కోట్ల రుణాలు
- మహిళల పేరుతోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలే యజమానులు..
- ఐటీ కారిడార్ లో 3.5 ఎకరాల్లో భారీ విక్రయ కేంద్రాల ఏర్పాటు
- 26 వేల ప్రభుత్వ పాఠశాలల యూనిఫాంల కుట్టే బాధ్యత
- ప్రభుత్వ కార్యాలయాల్లో క్యాంటీన్ల నిర్వహణ మహిళా సంఘాలకే అప్పగింత
- తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చడంలో మహిళలే కీలకం
- స్పందన' వాహనాలను ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

2

## నారీ రక్షణ..
# ప్రగతికి భరోసా!

"తెలంగాణ గడ్డపై మహిళల భద్రతకు తిరుగుండకూడదని, వారి గౌరవాన్ని కాపాడటమే తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని స్టేట్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా జరిగిన 'ప్రజాపాలన –ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా, మహిళల రక్షణ కవచంలా పనిచేసే 'స్పందన' ప్రత్యేక వాహనాలను ఆయన ప్రారంభించారు. కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ, 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చే బృహత్ ప్రణాళికలో వారిని భాగస్వాములను చేయడమే లక్ష్యమని సీఎం ప్రకటించారు. సమాజ ప్రగతికి ఆటంకంగా మారిన మాదక ద్రవ్యాల మహమ్మారిని 'ఈగల్ ఫోర్స్' ద్వారా తుదముట్టిస్తామని, డ్రగ్స్ విషయంలో ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. మహిళల పేరుతో ఆస్తుల కల్పన నుంచి, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా మార్చే వరకు.. నారీ శక్తి సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని సీఎం ఉద్ఘాటించారు."






2

## చాలా పార్టీలు వస్తుంటాయి.. పోతుంటాయి

- 25 ఏళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు చాలా తక్కువ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ఎస్ భవన్ లో ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు

# నెక్కొండ మార్కెట్ యార్డులో ఉద్రిక్తత

- ఎమ్మెల్యే మాధవరెడ్డి పర్యటనపై రైతుల ఆగ్రహం
- ఒక్కటంటే ఒక్కటే సెంటరా అంటూ మండిపడుతున్న అన్నదాతలు
- 45 డిగ్రీల ఎండలో గంటల తరబడి పడిగాపులు
- నాడు 5 కేంద్రాలు.. నేడు కష్టాల కుప్పలు
- కలెక్టర్ సాక్షిగా అన్నదాతల ఆవేదన

04

నెక్కొండ వ్యవసాయ మార్కెట్ యార్డు సోమవారం ఉద్రిక్తతకు వేదికైంది. సమస్యలు పరిష్కరిస్తారని ఆశించిన రైతులకు పోలీసుల పహారా, ఎమ్మెల్యే మొండివైఖరి ఎదురయ్యాయి. మక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించేందుకు ఎమ్మెల్యే మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్‌తో కలిసి రాగా.. భారీగా మోహరించిన పోలీసు బలగాలను చూసి రైతులు భయాందోళనకు గురయ్యారు. ప్రజాప్రతినిధి పర్యటన రైతుల సమస్యలు తీర్చాల్సింది పోయి, వారిని భయపెట్టేలా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

— వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం






- మహిళల రక్షణ కోసం 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా ప్రత్యేక వాహనాలు
- మత్తు పదార్థాల నియంత్రణకు 'ఈగల్ ఫోర్స్' ఏర్పాటు..
- బాధ్యులెవరైనా ఉపేక్షించేది లేదు..
- స్వయం సహాయక సంఘాలకు రూ. 60 వేల కోట్ల రుణాలు
- మహిళల పేరుతోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలే యజమానులు..
- ఐటీ కారిడార్ లో 3.5 ఎకరాల్లో భారీ విక్రయ కేంద్రాల ఏర్పాటు
- 26 వేల ప్రభుత్వ పాఠశాలల యూనిఫాంల కుట్టే బాధ్యత
- ప్రభుత్వ కార్యాలయాల్లో క్యాంటీన్ల నిర్వహణ మహిళా సంఘాలకే అప్పగింత
- తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చడంలో మహిళల పాత్రే కీలకం
- స్పందన' వాహనాలను ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

# నారీ రక్షణ.. ప్రగతికి భరోసా!

**హైదరాబాద్, ఏప్రిల్ 27 (ప్రభాత గమనం):**

తెలంగాణ రాష్ట్రంలో మహిళలు, పిల్లల రక్షణకు తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యతనిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని స్టేట్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా జరిగిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా, మహిళల తక్షణ రక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'స్పందన' (తక్షణ రక్షణ) వాహనాలను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పోలీస్ యంత్రాంగం, పీస్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో సీఎం కీలక ప్రసంగం చేశారు. గతంలో అమల్లోకి తెచ్చిన 'షీ టీమ్స్' వంటి కార్యక్రమాలకు అదనంగా, ఇప్పుడు 'స్పందన' బృందాలు క్షేత్రస్థాయిలో బాధితులకు మరింత భరోసానిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## ఆపదలో అభయం.. 'స్పందన'

ఈ బృందాలు రోజులో 24 గంటల పాటు నిరంతరం అందుబాటులో ఉంటాయని సీఎం వెల్లడించారు. ఎక్కడైనా మహిళలు ఆపదలో ఉన్నట్లు సమాచారం అందగానే, ఈ వాహనాలు తక్షణమే అక్కడికి చేరుకుంటాయి. కేవలం కేసు నమోదు చేయడమే కాకుండా, బాధితులకు మానసిక ధైర్యాన్ని కల్పించి, నిందితులపై చట్టపరమైన చర్యలు వేగవంతం చేసేలా ఈ టీమ్‌లు పనిచేస్తాయని వివరించారు. "మహిళలు చదువు, వ్యాపార రంగాల్లో స్వేచ్ఛగా రాణించినప్పుడే సమాజం ప్రగతి సాధిస్తుంది" అని సీఎం వ్యాఖ్యానించారు.

## డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం

మహిళలపై జరుగుతున్న నేరాల్లో అత్యధికం మత్తు పదార్థాల వ్యసనం వల్లే జరుగుతున్నాయని సీఎం విశ్లేషించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు 'ఈగల్ ఫోర్స్' ద్వారా ఉక్కుపాదం మోపుతున్నామని, గంజాయి లేదా డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగం విషయంలో ఎంతటి వారికైనా మినహాయింపు ఉండదని హెచ్చరించారు. వ్యసన విముక్తి కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున రిహాబిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

## ఆర్థికాభివృద్ధికి బృహత్ ప్రణాళిక

మహిళా సాధికారత కేవలం మాటలకే పరిమితం కాకూడదని, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ముఖ్యమంత్రి వివరించారు:

**ఆస్తి హక్కు:** ఇకపై ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్లు మహిళల పేరుతోనే ఉంటాయి.

**బ్యాంక్ లోన్లు:** 67 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 60 వేల కోట్ల బ్యాంక్ లోన్ లింకేజీ కల్పిస్తాం.

**మహిళా యజమానులు:** వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలనే యజమానులుగా చేసి, వారి ద్వారానే నిర్వహించే వినూత్న పథకం.

**ఉపాధి కల్పన:** 26 వేల ప్రభుత్వ పాఠశాలల యూనిఫాంల కుట్టే బాధ్యత మహిళా సంఘాలకే. ప్రభుత్వ కార్యాలయాల్లో క్యాంటీన్ల నిర్వహణ కూడా వారికే అప్పగింత.

**విక్రయ కేంద్రాలు:** హైటెక్ సిటీ సమీపంలో మహిళా ఉత్పత్తుల కోసం 3.5 ఎకరాల్లో భారీ విక్రయ కేంద్రాల ఏర్పాటు.

2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంలో మహిళల పాత్రే కీలకమని సీఎం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# బాల పంచాయతీ ద్వారా సురక్షిత గ్రామాల నిర్మాణం

- డీసీపీ ధార కవిత

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

బాల పంచాయతీ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో బాలబాలికల భద్రతను బలోపేతం చేయడంతో పాటు సురక్షిత గ్రామాల నిర్మాణం సాధ్యమవుతుందని వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న బాలల భద్రత వారోత్సవాల సందర్భంగా సంగం మండలం తీగరాజపల్లి గ్రామంలో బాల పంచాయతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గోపాల్ అధ్యక్షతన తెలంగాణ పోలీస్ విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో, మై ఛాయస్ ఫౌండేషన్ మరియు యంగిస్తాన్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిసిపి ధార కవిత మాట్లాడుతూ, బాల పంచాయతీ ద్వారా గ్రామంలోని 15 మంది బాలబాలికలను ఎంపిక చేసి చైల్డ్ పార్లమెంట్ రూపంలో ఏర్పాటుచేస్తారని తెలిపారు. ఈ బాల ప్రతినిధులు భవిష్యత్తులో గ్రామ అభివృద్ధి, పిల్లల భద్రత, వారి హక్కులు వంటి అంశాలపై నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని గ్రామ సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా కృషి చేస్తారని వివరించారు. బాల పంచాయతీ ప్రతినిధులు సూచించే సమస్యలు, పరిష్కార మార్గాలను పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖలు పరిగణనలోకి తీసుకోవాలని ఆమె సూచించారు. బాలల అభివృద్ధికి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా తల్లిదండ్రులు సంపూర్ణ సహకారం అందించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ, బాలల భద్రత మరియు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ బాల పంచాయతీ కార్యక్రమాన్ని తెలంగాణలో పైలట్ ప్రాజెక్టుగా తీగరాజపల్లి గ్రామంలో ప్రారంభించారని తెలిపారు. రెండు నెలల తరువాత బాలలు గుర్తించిన సమస్యల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా మై ఛాయస్ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్లు జన్ను క్రాంతి, ఎర్ర శ్రీకాంత్ పిల్లలకు విజన్ డాక్యుమెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మామునూరు ఏసిపి వెంకటేష్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఏహెచ్‌టీయూ ఇన్స్పెక్టర్ జే. శ్యాంసుందర్, షీ టీమ్స్ సీఐ సుజాత, భరోసా సీఐ సువర్ణ, ఎస్ఐ ప్రవీణ్, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ సహాయ, కోఆర్డినేటర్ బత్తుల కరుణ, డీఎల్పీవో వేదవతి, ఎంపీవో హర్షిత్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వసుధ పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

- కురవి మండలం లో భరోసా టీం అవగాహన సదస్సు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




మహబూబాబాద్ ఎస్పీ శబరిష్ ఆదేశానుసారంగా కురవి మార్కెట్ సముదాయం మరియు బస్ స్టాండ్ కురవి వీరభద్ర స్వామి ఆలయప్రాంగణం లో ప్రజా పాలనా- ప్రగతి ప్రణాళిక (90 రోజుల ప్రణాళిక) లో బాగంగా భరోసా టీం, అవగాహన కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. రకరకాల పద్ధతుల్లో మాయమాటలు చెప్పి అమ్మాయిలను, మహిళలను మోసాలు చేస్తున్న నేటి కాలంలో నేరాల అదుపులో ప్రజలు కీలకపాత్ర పోషించాలని, , జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వారు పేర్కొన్నారు.లింగ వివక్షత చూపించకుండా పిల్లల పెంపకం వుండాలని, బాల్య వివాహం ల నిర్ములన గురించి, సైబర్ నేరాలు, మానవ అక్రమ రావణ మరియు మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలి వివరించారు. మనకు తెలియని నెంబర్స్ నుండి మహిళలకు ఇబ్బందులు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా అసభ్యంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా పోలీస్ వారికి సమాచార అందించాలని సూచించారు. భరోసా సెంటర్ మరియు విధులు గురించి, మహిళలకు మరియు పిల్లలకు భరోసా సెంటర్ కల్పిస్తున్న సదుపాయాలు గురించి, ఫోక్స చట్టం గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో భరోసా ఇంచార్జ్ దీపిక, కో-ఆర్దినేటర్ కౌన్సలర్ జ్యోష్ణ పాల్గొన్నారు.




# అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, ఈ రోజు సాయంత్రం భూపాలపల్లి సిసిఎస్ బృందం ప్రత్యేక చర్యల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా చెల్పూర్ గ్రామానికి చెందిన కొండపల్లి పెద సారయ్య అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచినందుకు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుండి సుమారు 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం మరియు ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకోవడం జరిగింది. అనంతరం నిందితుడిని మరియు స్వాధీనం చేసిన వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఘనపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ కి అప్పగించడం జరిగింది. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీస్ శాఖ హెచ్చరించింది.

# చాలా పార్టీలు వస్తుంటాయి.. పోతుంటాయి

- 25 ఏళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు చాలా తక్కువ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ఎస్ భవన్ లో ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు

**హైదరాబాద్ (ప్రభాత గమనం):**

కవిత కొత్త పార్టీపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. చాలా పార్టీలు వస్తుంటాయి.. పోతుంటాయని ఎద్దేవా చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు చాలా తక్కువ అని పేర్కొన్నారు. కొత్త పార్టీని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కేసీఆర్ గురించి చాలా మంది మాట్లాడుతున్నారని.. వాటిని కూడా పట్టించుకోనక్కర్లేదని చెప్పారు.



# ట్రాఫిక్ పోలీసులు ఔదార్యం

- కిందపడిన ధాన్యం ఎత్తి రైతుకు సాయం
- ధన్యవాదాలు తెలిపిన రైతులు, స్థానికులు

**ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లా కేంద్రం అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డుపై ఓ రైతు తీసుకెళ్తున్న ధాన్యం బస్తా ప్రమాదవశాత్తూ జారి రోడ్డుపై చెల్లాచెదురైంది. ఈ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కాన్స్టేబుల్ భాస్కర్, పాపాలల్, హోమ్ గార్డ్ ఆఫీసర్ వెంకన్న పరిస్థితిని గమనించి వెంటనే స్పందించారు. రోడ్డుపై పడిన ధాన్యాన్ని వృథా కాకుండా జాగ్రత్తగా సేకరించి తిరిగి బస్తాలలో నింపి రైతుకు అందజేశారు. అంతేకాకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాలను నియంత్రిస్తూ, రోడ్డును శుభ్రపరచి సజావుగా రాకపోకలు సాగేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతు భూక్యా బాలాజీ ట్రాఫిక్ పోలీసుల సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు కూడా రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ, సరుకు రవాణా సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు.



# ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం ప్రమాణ స్వీకారం

హైదరాబాద్ (ప్రభాత గమనం): ఎమ్మెల్సీలుగా మంత్రి అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరాం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.







# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

- జెండా ఎగరేసిన ఆ పార్టీ నాయకులు
- కేక్ కట్ చేసి స్వీట్లు పంచిన శ్రేణులు
- ఆస్పత్రుల్లో బ్రెడ్డు, స్వీట్లు పంపిణీ
- పలు చోట్ల అన్నదానాలు



**బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. గ్రామాల నుంచి నగరాల వరకు జెండా ఆవిష్కరణలు, ర్యాలీలు, కేక్ కటింగ్ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలతో వేడుకలు సందడిగా సాగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని బీఆర్ఎస్ అభివృద్ధి పథకాలను గుర్తుచేసుకుంటూ తమ ఐక్యతను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం, రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక సేవలోనూ ముందుండాలని నేతలు పిలుపునిచ్చారు.**

### కేసీఆర్ ను విమర్శిస్తే సూర్యుడిపై ఉమ్మేసినట్లే

**-బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్**

కేసముద్రం, ఏప్రిల్ 27 (ప్రభాత గమనం) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన అపర భగీరథుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుపై విమర్శలు చేయడం అంటే సూర్యుడిపై ఉమ్మివేసినట్లేనని, అది తిరిగి విమర్శకుల ముఖానికే తగులుతుందని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ నజీర్ అహ్మద్ హెచ్చరించారు.సోమవారం కేసముద్రం స్టేషన్‌లోని మండల పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నజీర్ అహ్మద్ మాట్లాడారు.. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కెసిఆర్ ప్రాణాలకు తెగించి పోరాడితేనే నేడు తెలంగాణ సిద్ధించిందని, ఆయన కృషితోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, టౌన్ పార్టీ అధ్యక్షులు గూగుల్లోత్ వీరు నాయక్, ఊకంటి యాకుబ్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు వినయ్ రెడ్డి, ఆగే రాము, పైరాల శరత్, ఏర్పుల కుమార స్వామి, జి. రమేష్, తారా సింగ్, భానోత్ వెంకన్న, తోట శీను, శ్రీరంగం బిర్రు వెంకన్న, కాసు సాయి పాల్గొన్నారు.

### అస్తిత్వానికి ప్రతీక గులాబీ జెండా

గార్ల, ఏప్రిల్ 27 ప్రభాత గమనం :తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గార్ల మండల కేంద్రంలో సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ముందుగా తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగావత్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ.. అలుపెరగని పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత ఈ జెండాదేనని కొనియాడారు. వేడుకల్లో పార్టీ మండల ఉపాధ్యక్షులు బుడిగ మురళి, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, మైనార్టీ నాయకులు షఫీయుద్దీన్, మండల నాయకులు యాకూబ్ పాషా, మీగడ శ్రీను, ముంగి రాములు, సంగిశెట్టి ప్రభాకర్, చంద్రశేఖర్, మద్దివంచ సోషల్ మీడియా ప్రతినిధి సంతోష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పుష్కర్‌లో 'గులాబీ' పూజలు...

కేసముద్రం ఏప్రిల్ 27: (ప్రభాత గమనం) : భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాష్టాలు దాటి రాజస్థాన్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రం పుష్కర్‌కు చేరుకున్నాయి. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేసముద్రం మండలానికి చెందిన పలువురు కీలక నేతలు సోమవారం పుష్కర్‌లోని ప్రసిద్ధ గాయత్రి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి దర్శనం అనంతరం నాయకులు మాట్లాడారు.. తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఉద్భవించిన ఏకైక శక్తి బారాస అని కొనియాడారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచిందని, అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిచిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు.బారాస కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని, అది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అని స్పష్టం చేశారు.రాబోయే ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించి, మళ్లీ కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కావాలని మొక్కుకున్నట్లు తెలిపారు.కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర ప్రజల కష్టాలు తీరుతాయని, రాష్ట్రం మరింత సుభిక్షంగా మారుతుందని ఆకాంక్షించారు.ఈ ఆధ్యాత్మిక మరియు రాజకీయ కార్యక్రమంలో కేసముద్రం మండలానికి చెందిన నాయకులు కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, సంపత్ కుమార్ రెడ్డి, నర్సింగం, వెంకటేశ్వర్లు, బచ్చు పరమేశ్వర్, అప్పయ్య, రేణిగుంట్ల సుధాకర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఆలయ ప్రాంగణంలో జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో సందడి చేశారు.

# జిల్లా అక్రిడిటేషన్ కమిటీ ఎంపికలో అవకతవకలు

- కలెక్టర్ కు జర్నలిస్టుల ఫిర్యాదు

మహబూబాబాద్, ఏప్రిల్ 27: (ప్రభాత గమనం) :

మహబూబాబాద్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ 2026-28 ఏర్పాటులో భారీగా అక్రమాలు జరిగాయని, అర్హులకు అన్యాయం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా కమిటీని ప్రకటించారని తెలంగాణ జర్నలిస్ట్ వర్కింగ్ యూనియన్ (టీయూడబ్ల్యూజేహెచ్143) నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి అన్ని కోణాల్లో పరిశీలించకుండా, ఏకపక్షంగా కమిటీని ప్రకటించారని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లాలో ఉన్న అన్ని జర్నలిస్టు సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉండగా, కేవలం ఒకే సంఘం నుండి ఐదుగురిని నియమించి మిగిలిన సంఘాలకు అన్యాయం చేశారని పేర్కొన్నారు.గత 25 ఏళ్లుగా జర్నలిజంలో లేని, బంగారు దుకాణం (జ్యువెలరీ షాపు) నడుపుకుంటున్న వ్యక్తికి కమిటీలో చోటు కల్పించడంపై విస్మయం వ్యక్తం చేశారు.1987 నుండి జర్నలిస్టుగా కొనసాగుతున్న రాజమల్లు యాదవ్, 2005 నుండి పని చేస్తున్న చికటి శ్రీనివాస్ వంటి సీనియర్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ వారికి కమిటీలో చోటు దక్కలేదని వాపోయారు.రాష్ట్ర కమిటీలో ప్రాతినిధ్యం ఉన్న తమ యూనియన్ నుండి ముగ్గురు పేర్లు పంపగా, కేవలం ఇద్దరికే అవకాశం ఇచ్చారని, దరఖాస్తు చేసుకున్న ఇతర అర్హులను పక్కన పెట్టారని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు.కమిటీ ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని, నచ్చిన వారికి చోటు కల్పించేందుకు నిబంధనలను తుంగలో తొక్కారని జర్నలిస్టు సంఘం నాయకులు మద్దినేని గుట్టయ్య (జిల్లా కన్వీనర్), గాడిపెల్లి శేఖర్ (కో-కన్వీనర్) విమర్శించారు. జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన సీనియర్ జర్నలిస్టులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.



# ప్రతి కేసును నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలి

- మహబూబాబాద్ ఎస్పీ డాక్టర్ శబరీష్
- జిల్లా టౌన్ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ మీటింగ్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని సబ్‌డివిజన్ అధికారులు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు మరియు సంబంధిత విభాగాల అధికారులతో మహబూబాబాద్ జిల్లా టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, క్రైమ్ రివ్యూ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రస్తుత నేర స్థితిగతులు, పెండింగ్ కేసుల పరిష్కారం, విచారణల పురోగతి, లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసును నాణ్యతతో దర్యాప్తు చేసి, నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే "మన ఊరు – మన బాధ్యత" కార్యక్రమం అమలుపై ప్రత్యేకంగా ఆరా తీసి, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, యువతలో అవగాహన కార్యక్రమాలు, ప్రజలతో సమన్వయం పెంపు వంటి అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు ప్రజలతో సాన్నిహిత్యం పెంచుకొని, నేరాల నియంత్రణలో ముందుండాలని, సాంకేతిక వనరులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో కేసులకు శిక్షలు సాధించడంలో ప్రతిభ కనబరిచి కృషి చేసిన అధికారులు సిబ్బందిని ఎస్పీ అభినందించి, సంబంధిత సీడీఓ లకు రివార్డులు అందజేశారు. అలాగే, కేసుల్లో శిక్షలు సాధించడంలో తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కంపల్లి వెంకటయ్యకు శాలువాతో సన్మానించి మెమెంటో అందించారు. అనంతరం జిల్లా పోలీస్ వాహనాలపై ప్రత్యేకంగా ఇన్స్పెక్షన్ నిర్వహించగా, ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి వాహనాల స్థితి మరియు వాహనాలకు సంబంధించిన సమస్యలను నమోదు చేసి ఎంటీఓ ఆర్ఐ సోములు పర్యవేక్షించారు. వాహనాలను ఎల్లప్పుడూ మంచి స్థితిలో ఉంచి, సమయానికి మెయింటెనెన్స్ చేయాలని సూచించారు.డ్రైవింగ్ చేసేటపుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



# ఎస్పీని కలిసిన కురవి, గంగారం ఎస్సైలు

ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో:

కురవి, గంగారం పోలీస్ స్టేషన్లకు ఎస్ఐలుగా ఇటీవల నియమితులైన సతీష్ , కోటేశ్వర రావు సోమవారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి ఆశీస్సులు పొందారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ డా. శబరీష్ సూచించారు. కురవి,గంగారం పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పని చేస్తామని ఈ సందర్భంగా ఎస్సైలు సతీష్, కోటేశ్వర రావు తెలిపారు.



# ప్రజావాణి వినతులను వెంటనే పరిష్కరించాలి

- ఉద్యోగులందరూ స్వీయ జనగణన కార్యక్రమంలో వివరాలు నమోదు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

మహబూబాబాద్ ఏప్రిల్ 27(ప్రభాత గమనం):



ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేయాలని, ప్రతి దరఖాస్తులు పారదర్శకంగా పరిశీలించాలని, సూచించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు నిర్వహించిన అన్ని కార్యక్రమాలను అందరూ సమిష్టిగా విజయవంతం చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో మరింత పకడ్బందీగా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.ప్రజావాణి దరఖాస్తులను కూడా పరిష్కరించాలని కోరారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరిగే స్వీయ జన గణన కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు తమ పరిధిలో ఉన్న ప్రతి ఉద్యోగులు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో వివిధ శాఖలలో మొత్తం (179) దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మరిపెడ మండల కేంద్రంలోని సర్వే నంబర్ 264లో గల 02 ఎకరాల 16 గుంటల ప్రభుత్వ భూమిని, నిరుపేదలైన సుమారు 30 మంది పాత్రికేయులకు నివాస గృహాల కోసం కేటాయించాలని మరిపెడ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.పెండింగ్‌లో ఉన్న భూ మార్పిడి, వారసత్వ హక్కులు మరియు ఇతర ధరణి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని పలువురు రైతులు దరఖాస్తు చేసుకున్నారు.కొత్త రేషన్ కార్డుల మంజూరు మరియు ఆసరా పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారుల నుండి వినతులు అందాయి.డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం మరియు తాగునీటి సమస్యలపై ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు.ప్రజావాణి కార్యక్రమం సమయం పూర్తి అయిన అదనంగా రెండున్నర గంటల వరకు దరఖాస్తులతో వేచి ఉన్న ప్రజల యొక్క వినుతులను స్వీకరించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండల కేంద్రాలలోని గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యలను వివరించి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మహబూబాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారినీ కృష్ణవేణి, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మధుసూదన రాజు, అన్ని విభాగాల జిల్లా అధికారులు,పర్యవేక్షకులు మదన్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# ఎండ నివారణకు గ్రీన్ మ్యాట్ షేడ్

- ప్రయాణికులకు ఉపశమనం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కాజిపేట జంక్షన్ పరిసర ప్రాంతంలో రోడ్డు ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా గ్రీన్ మ్యాట్ షేడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం విశేషం. ఇటీవల రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాదచారులు, ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఎండ కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులను గమనించిన ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ గ్రీన్ మ్యాట్ షేడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ షేడ్ ఏర్పాటులో స్థానిక వ్యాపారి రాకేష్ (శ్రీ రామ్ సైకిల్ షాప్ యజమాని) కీలక పాత్ర పోషించారు. ఆయన స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం అందించడంతో పనులు వేగంగా పూర్తయ్యాయి. పోలీసుల సేవా భావం, స్థానికుల సహకారం కలిసివచ్చి ఈ కార్యక్రమం విజయవంతమైంది. గ్రీన్ మ్యాట్ షేడ్ ఏర్పాటు వల్ల ఎండ కిరణాలు నేరుగా పడకుండా అడ్డుకట్ట పడటంతో, అక్కడ వేచి ఉండే ప్రయాణికులకు కొంత చల్లదనం లభిస్తోంది. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో ఇది ఎంతో ఉపయోగకరంగా మారింది. ఈ సందర్భంగా కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి. వెంకన్న మాట్లాడుతూ, ప్రజల సౌకర్యం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని, భవిష్యత్తులో మరిన్ని ప్రధాన కూడళ్లలో కూడా ఇలాంటి షేడ్‌లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులు ఈ చర్యపై సంతోషం వ్యక్తం చేస్తూ ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



# కేసముద్రం మార్కెట్ సమస్యలపై కలెక్టర్‌కు వినతి

- సబ్ సెంటర్ల ఏర్పాటుకు కలెక్టర్ కు విజ్ఞప్తి

కేసముద్రం, ఏప్రిల్ 27: (ప్రభాత గమనం) :

కేసముద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంటా సంజీవరెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులోని ప్రస్తుత పరిస్థితులను, రైతుల ఇక్కట్లను ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో పలు సాంకేతిక, రవాణా పరమైన అడ్డంకులు ఏర్పడినట్లు ఛైర్మన్ వివరించారు. ప్రధానంగా కాంటా పూర్తయిన సరుకును గోదాములకు తరలించడానికి సరిపడా లారీలు అందుబాటులో లేకపోవడంతో ఎగుమతులు నిలిచిపోయాయని తెలిపారు.ఎగుమతులు జరగకపోవడంతో మార్కెట్ యార్డ్ అంతా మొక్కజొన్న బస్తాలతో నిండిపోయిందని పేర్కొన్నారు. దీనివల్ల కొత్తగా సరుకు తెచ్చే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కొనుగోలు కేంద్రంలో అవసరమైన ఖాళీ గోనె సంచులు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రక్రియ మందగిస్తోందని చెప్పారు.తమ వంతు ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు రోజుల తరబడి మార్కెట్ యార్డులోనే వేచి ఉండాల్సి వస్తోందన్నారు.కేసముద్రం మార్కెట్ యార్డుపై ఒత్తిడిని తగ్గించేందుకు, రైతులకు రవాణా భారం తప్పించేందుకు గాను ప్రాంతాల వారీగా, గ్రామాల వారీగా సబ్ సెంటర్లను (ఉప కేంద్రాలను) ఏర్పాటు చేయాలని ఛైర్మన్ సంజీవరెడ్డి కలెక్టర్‌ను కోరారు. దీనివల్ల రైతులు తమ గ్రామాలకు సమీపంలోనే సరుకు అమ్ముకునే వీలుంటుందని ఆయన సూచించారు.రైతుల సమస్యల పట్ల జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరితగతిన సమస్యలను పరిష్కరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారని ఛైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల ప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత గమనం
వరంగల్, మంగళవారం, 28-04-2026

# నెక్కొండ మార్కెట్ యార్డులో ఉద్రిక్తత

- ఎమ్మెల్యే మాధవరెడ్డి పర్యటనపై రైతుల ఆగ్రహం
- ఒక్కటంటే ఒక్కటే సెంటరా అంటూ మండిపడుతున్న అన్నదాతలు
- 45 డిగ్రీల ఎండలో గంటల తరబడి పడిగాపులు
- నాడు 5 కేంద్రాలు.. నేడు కష్టాల కుప్పలు
- కలెక్టర్ సాక్షిగా అన్నదాతల ఆవేదన



వరంగల్ బ్యూరో ఏప్రిల్ 27 (ప్రభాత గమనం) :

నెక్కొండ వ్యవసాయ మార్కెట్ యార్డు సోమవారం ఉద్రిక్తతకు వేదికైంది. సమస్యలు పరిష్కరిస్తారని ఆశించిన రైతులకు పోలీసుల పహారా, ఎమ్మెల్యే మొండివైఖరి ఎదురయ్యాయి. మక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించేందుకు ఎమ్మెల్యే మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్‌తో కలిసి రాగా.. భారీగా మోహరించిన పోలీసు బలగాలను చూసి రైతులు భయాందోళనకు గురయ్యారు. ప్రజాప్రతినిధి పర్యటన రైతుల సమస్యలు తీర్చాల్సింది పోయి, వారిని భయపెట్టేలా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నిప్పుల కుంపటిలో తిప్పలు తప్పడం లేదు

మండలంలో సుమారు 1400 ఎకరాల్లో మక్కజొన్న సాగు చేయగా, ప్రభుత్వం కేవలం ఒక్క కొనుగోలు కేంద్రాన్ని మాత్రమే ఏర్పాటు చేయడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ముందస్తు వ్యూహంతో 7 కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచారు. కానీ నేడు, కేంద్రాల కొరతతో రైతులు పంటను మార్కెట్ బయట, గుట్టల పక్కన కుప్పలు పోయాల్సిన దుస్థితి నెలకొంది.

### - కలెక్టర్ మేడం.. మా గోడు వినరా..?

జిల్లా కలెక్టర్ పర్యటనలో ఉన్నా, రైతుల ఇబ్బందులను గమనించకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. 'ఇంకా ఎన్ని రోజులు మార్కెట్ల చుట్టూ తిరగాలి? ఎండకు మాడిపోవాలా? వానకు తడిసిపోవాలా?' అని రైతులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. వాతావరణ శాఖ వర్ష సూచన జారీ చేయడంతో, ఏ క్షణాన వానొచ్చి పంటను ముంచేస్తుందోనని అన్నదాతలు వణికిపోతున్నారు.

### ప్రభుత్వంపై పెల్లుబుకుతున్న నిరసన

మండలంలో కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారడానికి రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యమే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల్లో అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. తక్షణమే మక్కజొన్నను గోదాములకు తరలించి తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రైతులకు ఇబ్బంది కలగనివ్వొద్దు

- మక్కల కొనుగోళ్లను వేగవంతం చేయాలి
- అధికారులకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశం
- నెక్కొండ కొనుగోలు కేంద్రం సందర్శన



నెక్కొండ ఏప్రిల్ 27(ప్రభాత గమనం):

మక్కల కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం వద్ద తూకం, రవాణా, నిల్వ సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. మక్కల సేకరణలో జాప్యం జరగకుండా చూడాలని, తూకం వేసిన వెంటనే రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రైతుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్న ఆయన, వాటిని అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో ఉమారాణి, డీసీవో నీరజ, ఎమ్మార్వో రాజ్‌కుమార్, మార్కెటింగ్ అధికారిణి సురేఖ, మార్కెట్ సెక్రటరీ కృష్ణ మినన్ రావుతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




# లింక్ ప్రొడక్ట్స్ వద్దు.. డీలర్ల మార్జిన్ ముద్దు

- గార్లలో ఎరువుల దుకాణాల సంపూర్ణ బంద్

గార్ల, ఏప్రిల్ 27 (ప్రభాత గమనం) :

సబ్సిడీ ఎరువుల సరఫరాలో జరుగుతున్న అవకతవకలు, కంపెనీల వేధింపులకు నిరసనగా గార్ల మండల కేంద్రంలో ఎరువులు, విత్తనాలు మరియు పురుగుమందుల డీలర్లు సోమవారం కదం తొక్కారు. రాష్ట్ర అసోసియేషన్ పిలుపులో భాగంగా మండలంలోని వ్యాపారులందరూ స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి సంపూర్ణ బంద్ పాటించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారులు (AEOలు) పూజిత, మేఘనలకు అందజేసి, పట్టణ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ తమను వేధిస్తున్న పలు సమస్యలను ఎండగట్టారు:ఎరువులతో పాటు అనవసరమైన ఇతర ఉత్పత్తులను (Link Products) విక్రయించాలంటూ కంపెనీలు పెడుతున్న ఒత్తిడిని వెంటనే ఆపాలి.ప్రస్తుత ధరలకు అనుగుణంగా డీలర్ల లాభం (Margin) పెంచాలి.డీలర్లపై భారం పడకుండా రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరించాలి.FOL మరియు HT Bt కాటన్ విత్తనాలకు సంబంధించి ఎదురవుతున్న క్లిష్టమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి. "కంపెనీల అసంబద్ధ నిర్ణయాల వల్ల అటు డీలర్లు, ఇటు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



# 'ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం' పోస్టర్ ఆవిష్కరణ

- నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం
- కలెక్టర్ స్నేహ శబరీష్

మహబూబాబాద్ ఏప్రిల్ 27(ప్రభాత గమనం):

కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అలాగే ఉపాధి అవకాశాలను కల్పించే ఉద్దేశంతో రూపొందించిన 'ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం' ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. భారతదేశంలోని టాప్-500 అగ్రశ్రేణి కంపెనీలలో ఇంటర్న్‌షిప్ పొందేందుకు ఈ పథకం ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని కలెక్టర్ స్నేహ శబరీష్ పేర్కొన్నారు. అర్హతలు:18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 9,000/- ఆర్థిక సహాయం (స్టైఫండ్) అందించబడుతుందని పేర్కొన్నారు.దేశంలోని ప్రముఖ కంపెనీలలో ప్రత్యక్షంగా పనిచేస్తూ వాస్తవ పరిశ్రమ అనుభవాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం పూర్తి స్థాయి ఉద్యోగంలో లేని వారు మాత్రమే ఈ పథకానికి అర్హులని తెలిపారు. దేశవ్యాప్తంగా అనేక జిల్లాల్లో వివిధ రంగాల్లో ఈ ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి మరియు అర్హత కలిగిన అభ్యర్థులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. pminternship.mca.gov.in టోల్ ఫ్రీ నంబర్: 1800 116 090 వెబ్సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.యువత తమ కెరీర్‌ను ఉన్నతంగా నిర్మించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు శ్రీనివాసరావు, దేశీ రామ్ నాయక్, ఉపాధి కల్పన అధికారి రజిత, క్రీడల అధికారి జ్యోతి లు పాల్గొన్నారు.

# మేడేను విజయవంతం చేయండి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ పిలుపు
- కార్మిక హక్కులను హరించే 'లేబర్ కోడ్'లను రద్దు చేయాలి



గార్ల, ఏప్రిల్ 27 ( ప్రభాత గమనం) :

మేడే దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన భారీ ర్యాలీలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.సోమవారం గార్ల మండల కేంద్రంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద మేడే సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు నూతన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.కార్మిక వర్గ సంక్షేమం కోసం జరిగిన చారిత్రాత్మక పోరాటాలను స్మరించుకుంటూ, ఐక్యతను చాటడానికి మేడే ఒక గొప్ప వేదికని పేర్కొన్నారు.మండల కేంద్రంలో జరిగే ప్రదర్శనలో ప్రతి కార్మికుడు భాగస్వామి కావాలని కోరారు. "కార్మిక చట్టాలను నీరుగార్చే ప్రయత్నాలను అడ్డుకోవాలి. మన హక్కుల పరిరక్షణ కోసం జరిగే పోరాటంలో భవన నిర్మాణ కార్మికులు ముందుండాలి."ఈ సన్నాహక కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక యూనియన్ నాయకులు జడ శ్రీను, షేక్ మౌలానా, తాళ్లూరి రవీందర్, బదుగుల వెంకన్న, సత్యం మేస్త్రి, లల్లూ మేస్త్రిలతో పాటు పెద్ద సంఖ్యలో సుతారి మేస్త్రిలు, కూలీలు పాల్గొన్నారు.

# ఘనంగా చైల్డ్ సేఫ్టీ, డ్రగ్స్ నివారణ వారోత్సవాలు

- పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్ ఏప్రిల్ 27(ప్రభాత గమనం):

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నేటి నుండి మే 2 వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి (5) చైల్డ్ కేర్ ఇనిస్ట్యూట్ (127) పిల్లలు చదువుతున్నారని అందులో శనివారం ఏడుగురు విద్యార్థినీ లకు వివిధ సర్టిఫికెట్లు ఆరోగ్యశ్రీ, కులము ,నివాసము విద్యార్హతలు, అందచేయడం జరిగిందని, అలాగే క్రీడ సామాగ్రి క్యారం, క్రికెట్ బ్యాట్, టెన్నిస్ బ్యాట్స్, షటిల్ బ్యాట్ లు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..చైల్డ్ కేర్ హోమ్ లో ఉన్న పిల్లలు చదువుతోపాటు క్రీడల్లో సామాజిక అంశాలలో ముందుండాలని సూచించారు. అంతకుముందు హోమ్ లోని పరిసరాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.పిల్లలకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ కల్పించాలని, ప్రతినిత్యం షెడ్యూలు ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. చైల్డ్ కేర్ హోమ్ లో అందిస్తున్న సౌకర్యాలు వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో సరదాగా గడిపిన కలెక్టర్ వివిధ అంశాలలో ప్రతిభ ఘనపరిచిన పిల్లలను అభినందించారు. పిల్లలకు డ్రగ్స్, హెల్మెట్ ,రోడ్డు భద్రత, హెల్త్, ఎడ్యుకేషన్, సానిటేషన్, న్యూట్రిషన్ ల పై అవగాహన కల్పించాలని, అలాంటి చెడు అలవాట్లు దరిచేరకుండా జాగ్రత్తలు వహించాలని, మే 2 వరకు జరిగే కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ అధికారిని సవిత, సీడీపీఓలు శిరీష, రాజ్యలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.



# మత్తు వద్దు.. మైదానమే ముద్దు

- ఉప్పరపల్లిలో 'ఎల్ బీ స్పోర్ట్స్ క్లబ్' సమరశంఖం

కేసముద్రం ఏప్రిల్ 27 (ప్రభాత గమనం):

నేటి యువత మత్తులో చిక్కుకొని భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్న తరుణంలో.. ఉప్పరపల్లి వేదికగా ఒక ఆరోగ్యకరమైన విప్లవం మొదలైంది. "వ్యసనాలు వద్దు - క్రీడలే ముద్దు" అనే నినాదంతో ఎల్బీ స్పోర్ట్స్ క్లబ్ యువతను మేల్కొలిపే బాధ్యతను భుజాని కెత్తుకుంది. గంజాయి వంటి ప్రాణాంతక వ్యసనాల కోరల నుండి రేపటి పౌరులను రక్షించడమే లక్ష్యంగా క్లబ్ సభ్యులు నడుం బిగించారు.ప్రాంతంలోని యువత దారి తప్పకుండా ఉండాలంటే కేవలం ఉపన్యాసాలు సరిపోవని, వారి శక్తిని క్రీడల వైపు మళ్లించాలని ఎల్బీ స్పోర్ట్స్ క్లబ్ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. "మైదానంలో చిందించే ప్రతి చెమట చుక్క ఒక వ్యసనాన్ని దూరం చేస్తుందని తెలిపారు. శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం ఉన్న యువతతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యం" అని స్పష్టం చేశారు.ఈ ప్రచారంలో భాగంగా క్లబ్ సభ్యులు తల్లిదండ్రులకు పలు కీలక సూచనలు చేశారు. పిల్లలు ఖాళీ సమయంలో ఎక్కడ ఉంటున్నారు? ఎవరితో తిరుగుతున్నారో గమనించాలని తెలిపారు.చెడు స్నేహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సెల్ ఫోన్లకు, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా వారిని మైదానాల వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు...గంజాయికి స్వస్తి - ఆరోగ్యమే ఆస్తి, మత్తుకు బానిసకాకు - జీవితాన్ని నాశనం చేసుకోకు, ఆటలతో ఆరోగ్యం - గంజాయితో అనారోగ్యం అనే ఈ సామాజిక చైతన్య కార్యక్రమం చేపట్టారు. యువత కోసం అహర్నిశలు కృషి చేస్తామని, క్రీడల్లో వారిని ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని క్లబ్ సభ్యులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.కేవలం ఒక క్లబ్ బాధ్యతగానే కాకుండా, ఉప్పరపల్లి వాసులందరూ ఏకమై ఈ 'మత్తు రక్కసి'ని తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైంది. గుర్తిద్దాం.. మత్తులో వినాశనం ఉంది, మైదానంలో విజయం ఉంది అని సంకల్పించారు. లాల్ బహదూర్ స్కూల్ కరస్పాండెంట్ జోగు డాంగయ్య, ఎలబోయిన శ్రీనివాస్, శాగంటి రాములు, అల్లి రమేష్, పరకాల మురళి, శాగంటి శ్రీనివాస్, పబ్బతి రాజేందర్, ఆవుల చందు, రాకేష్, రఘు, వర్షిత్, నందు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ మున్సిపాలిటీలోనే 'బేతోలు'..

- పోలీస్ స్టేషన్ మాత్రం 'కురవి' లోనా?
- రెవెన్యూ పనులకు ఇక్కడ.. రక్షణ కోసం అక్కడ
- 6వ వార్డు ప్రజల అవస్థలు
- జిల్లా కలెక్టర్ కు గ్రామస్తుల వినతి

మహబూబాబాద్, ప్రభాత గమనం:

ఒకే ఊరు.. ఒకే మున్సిపాలిటీ.. కానీ అధికార పరిధులు మాత్రం వేర్వేరు. రెవెన్యూ పనుల కోసం ఒక నియోజకవర్గానికి, పోలీస్ స్టేషన్ పనుల కోసం మరో నియోజకవర్గానికి తిరగలేక మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు బేతోలు గ్రామ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తమ గ్రామాన్ని తక్షణమే మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చాలంటూ సోమవారం గ్రీవెన్స్ లో జిల్లా అధికారులకు గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బేతోలు గ్రామస్తుల గోడు వింటే పాలనా విభాగాల మధ్య ఉన్న సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం బేతోలు గ్రామం మహబూబాబాద్ నియోజకవర్గం, మున్సిపాలిటీ పరిధిలో ఉంది. దీనికి సంబంధించిన ఎమ్మార్వో ఆఫీస్, ఆర్డీవో ఆఫీస్, విద్యాశాఖ కార్యాలయం, విద్యుత్ కార్యాలయం, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ వంటి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మహబూబాబాద్‌లోనే ఉన్నాయి. కానీ, అత్యంత కీలకమైన పోలీస్ స్టేషన్ పరిధి మాత్రం డోర్నకల్ నియోజకవర్గంలోని కొరివి మండల పరిధిలో ఉంది."మా గ్రామంలో ఏదైనా గొడవ జరిగినా, దొంగతనం జరిగినా ఫిర్యాదు చేయడానికి కురవికి వెళ్లాల్సి వస్తోంది. అన్ని పనులు మహబూబాబాద్‌లోనే ముగుస్తాయి కానీ, రక్షణ విషయానికి వస్తే మాత్రం కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో మండల పోలీస్ స్టేషన్ ఆశ్రయించాల్సి రావడం మాకు శాపంగా మారింది," అని అధికారుల ఎదుట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని రెవెన్యూ ఆఫీసులు మహబూబాబాద్‌లోనే ఉన్నందున, పోలీస్ పరిధిని కూడా టౌన్ స్టేషన్‌కు మార్చాలని కోరారు.అత్యవసర సమయాల్లో కురవి పోలీసులు రావడం కంటే, స్థానికంగా ఉన్న టౌన్ పోలీసులు త్వరగా స్పందించే అవకాశం ఉంటుందని తెలిపారు. రెవెన్యూ మరియు పోలీస్ శాఖలు సమన్వయంతో చేయాల్సిన పనుల సమయంలో అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే తమ సమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో షేక్ ఖాదర్ బాబా, భూక్య రాంజి, గద్దపాటి సంతోష్, సుగనబోయిన వెంకన్న, గంగుల శ్రీను, జినుక ఎల్లయ్య, సిరికొండ కృష్ణ పాల్గొన్నారు.




Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374